సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



ప్రకృతి సోయగాల కొల్లేరు

కొల్లేరు ప్రకృతి సోయగాలతో అలరారుతోంది. కొల్లేరు పర్యాటకాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. 8లో



గురువులే ప్రత్యక్ష దైవాలు

సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తున్న గురువులు ప్రత్యక్ష దైవాలని రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. 8లో



భీమవరంలో హత్య

భీమవరంలో పట్టపగలు యువకుడి హత్య సంచలనం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హతమార్చారు. 8లో

న్యూస్‌రీల్

భారతీయ విద్యాభవన్స్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



న్యూయార్క్‌లో అంతర్జాతీయ అవార్డు అందుకుంటున్న శ్రీరంగనాథరాజు

పెనుగొండ : భారతీయ విద్యాభవన్స్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ భీమవరం అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ గ్రీన్ స్కూల్–2023 అవార్డు సాధించింది. ఈ అవార్డును న్యూయార్క్‌లో జరిగిన సదస్సులో స్కూల్ చైర్మన్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందుకున్నారు. అంతర్జాతీయంగా ఉన్న పాఠశాలల్లో పర్యావరణం, నిర్వహణ, పచ్చదనాన్ని ప్రోత్సహించడంపై నిబద్ధత, క్యాంపస్ శుభ్రత, పాఠ్యాంశాల్లో ఉత్తమ అభ్యాసాలకు ఏటా యూఎస్‌లోని గ్రీన్ మౌంటర్స్, న్యూయార్క్ గ్రీన్‌స్కూల్ కాన్ఫరెన్స్ పురస్కారాలు అందిస్తోంది. ఈ కోవలో భీమవరం భారతీయ విద్యాభవన్స్ అవార్డును గెలుచుకుంది. న్యూయార్క్‌లోని కోర్నల్ యూనివర్సిటీలోని 570 లెక్సింగ్‌టన్ ఎవెన్యూలో జరిగిన 78వ సెషన్స్‌లో గ్రీన్ మెంటర్స్ ఫౌండర్ వీరేంద్ర రావత్, సంస్థ సభ్యుల చేతులమీదుగా అవార్డును మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం అందుకున్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

విశ్వకర్మ జయంతి

భీమవరం (ప్రకాశంచౌక్): సకల చరాచర సృష్టికి మూలకారకుడైన ఆదిపురుషుడు విరాట్ విశ్వకర్మ అని, ఆయన దైవసమానులని జిల్లా వెనుకబడి తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్ కేఎస్ఎస్ గణపతిరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా వెనుకబడి తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



భీమవరంలో గణపతి ప్రతిమలు తరలిస్తున్న భక్తులు

నరసాపురంలో పందిరిని ముస్తాబు చేస్తున్న యువకులు



అత్తిలిలో పూలు, పండ్ల విక్రయాలు

చవితి సందడి.. ఆధ్యాత్మిక ఒరవడి

ఆదిదేవుడి పూజకు అంతటా ముస్తాబైంది. వినాయక చవితి వేడుకలకు భక్తులు సర్వం సిద్ధం చేశారు. ఆలయాలు, పందిళ్లు, ఇళ్లలో సోమవారం చవితి పూజలు ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు ఆదివారం జిల్లా అంతటా చవితి సందడి కనిపించింది. వినాయక ప్రతిమలు, పత్రి, పూలు, పండ్లు, పూజా సామగ్రి అమ్మకాలు ఉత్సాహంగా సాగాయి.

–సాక్షి నెట్‌వర్క్

జగన్ పాలనలో ప్రజలంతా సురక్షితం



మెట్ట ఉప్పరగూడెంలో రైతు భరోసా కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సురక్షితంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనాలు, గోడౌన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి బృందాలు ఇక్కడకు వచ్చి పరిశీలన చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాలకు అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అంటే ప్రజల కోసం పనిచేయాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రుజువు చేసిందన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన భవనాలు మెట్ట ఉప్పరగూడెంలో ఉన్నాయని, వాటి పరిస్థితి అధ్వానంగా ఉన్నా ఈ గ్రామానికి అవి చాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు వ్యాఖ్యానాలు చేయడం ప్రజలపై వారికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత ఆలోచనలకు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన భవనాలు అద్దం పడుతున్నాయన్నారు. గత పాలకులు గ్రామాల్లో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం పేరుతో అవినీతి చేశారన్నారు. చంద్రబాబు స్కీములు పేరుతో స్కాములు చేసి కోట్లు దోచేశాడని విమర్శించాడు. బాబు వస్తే జాబు, నిరుద్యోగ భృతి అంటూ ప్రజలకు ఆశలు చూపు మొండిచేయి చూపారని ధ్వజమెత్తారు. స్థానిక నాయకులు కొందరు కారుకూతలు కూస్తున్నారని, పద్ధతి మార్చుకోకుంటే ఎలా సమాధానం చెప్పాలో తనకు తెలుసని మంత్రి హెచ్చరించారు. నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, మార్లపూడి సుబ్బారావు, ముత్యాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిత్రకళా పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకాలు సాధించారని హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపులో భాగంగా హైదరాబాద్ యంగ్ ఎన్వాయిస్ ఇంటర్నేషనల్ నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, స్వాతంత్ర్య సమర ఘట్టాలు చిత్రించగా 15 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 30 మంది జ్యూరీ హానర్ బహుమతులు సాధించినట్లు చెప్పారు.

కారు ఢీకొని యువకుడి మృతి

తణుకు: రూరల్ పరిధిలోని పైడిపర్రులో ఆదివారం రోడ్డు ప్రమాదంలో గణపవరం మండలం వాకపల్లికి చెందిన మొగిలిసీడి శ్రీరామ్ (22) మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీరామ్‌తో పాటు బద్దా రాజు, తానేటి కమలకుమార్‌లు బైక్‌పై తణుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బస్టాండు సమీపంలో కారు ఢీకొట్టింది. శ్రీరామ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజు, కమలకుమార్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రకృతి సోయగాల కొల్లేరు



కొల్లేటి సరస్సులో తుళ్లేటి చేపల వయ్యారాలకు ప్రకృతి సోయగాలు తోడవుతున్నాయి. దక్షిణ కశ్మీర్‌గా పేరుగడించిన కొల్లేరు పర్యాటకాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోంది. చిత్తడి నేలల పరిరక్షణలో భాగంగా కొల్లేరు అంబాసిడర్‌గా వలస పక్షి గూడబాతు (స్పాట్ బిల్ట్ గ్రే పెలికాన్)ను ఇప్పటికే గుర్తించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆపరేషన్ కొల్లేరు జరిగింది. పర్యావరణానికి విఘాతం కలిగించే ఆక్రమణ చెరువులు ధ్వంసం చేయడంతో కొల్లేరులో తిరిగి ప్రకృతి పరిఢవిల్లింది. దీంతో విదేశీ వలస పక్షులు సంఖ్య నానాటికి కొల్లేరులో పెరుగుతోంది.

- ఎకో టూరిజం కింద రూ.187 కోట్లతో అభివృద్ధికి ప్రణాళిక
- ఇటీవల కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- బోటు షికారు, పక్షుల వీక్షణకు 20 ప్రదేశాల గుర్తింపు
- జీవవైవిధ్య యాజమాన్య కమిటీల ఏర్పాటుకు కసరత్తు



చిత్తడి నేలల కొల్లేరు ప్రాంతం



కొల్లేరులో పక్షుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు

కైకలూరు: జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్ల ప్రణాళికతో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 10 ప్రదేశాలను పర్యాటక శాఖ గుర్తించింది. ఏలూరు జిల్లాలో ఆటపాక పక్షులు కేంద్రం, ఏలూరు సమీపంలో మాధవాపురం పక్షుల విహార కేంద్రాలు ప్రసిద్ధి గాంచాయి. ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్ పక్షులు ఎక్కువ సంఖ్యలో రావడంతో కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణం చేశారు.

జీవవైవిధ్యానికి పెద్దపీట

భూమిపై వృక్షాలు, జంతువులు సూక్ష్మజీవులు, ఔషధాలు వంటి జీవవైవిధ్య అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం. ఇక్కడ వివిధ జాతుల పక్షులు, చేపలు, చెట్లు, కీటకాలు, సర్పాలు నివసిస్తున్నాయి. కొల్లేరు సరస్సులో అరుదైన నల్లజాతి చేపలు ఉన్నాయి. గ్రామస్థాయిలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు (బీఎంసీ)ల ఏర్పాటుపై అటవీశాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నారు. గ్రామాల పరిధిలో ప్రత్యేకత కలిగిన ఔషధ మొక్కలు, పూర్వీకులు సాగు చేసిన వరి వంగడాలు వంటి వాటిపై ఆ ప్రాంత వాసులు పేటెంట్ సంక్రమింపజేసే అధికారాలు ఈ కమిటీ ద్వారా పొందవచ్చు. ఇప్పటికే పర్యావరణ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేశామని అటవీ అధికారులు చెప్పారు.

కొల్లేరులో పెరిగిన పక్షుల సంఖ్య

కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో ప్రకృతి అనుకూలంగా ఉండటంతో పక్షుల సంఖ్య పెరిగింది. ఈ ఏడాది కొల్లేరులో జరిగిన పక్షుల గణనలో 105 రకాల పక్షి జాతులను, 81,495 పక్షులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో మొదటి స్థానంలో కోయిలలు (7,875) రెండో స్థానంలో పెలికాన్ పక్షులు(6,869) ఉండగా, అరుదైన పిన్‌టయిల్ స్నిప్ (సూది తోక పురెది) పక్షి ఒకటి, సిట్రిన్ వాగ్‌యల్(పుసుపు తల జిట్టంగి) పక్షులు నాలుగు కనిపించాయి. పక్షుల విహార కేంద్రాల్లో వలస పక్షులు సంతానోత్పత్తి కోసం అటవీశాఖ ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేసింది.

అభయారణ్య పరిరక్షణే లక్ష్యం



కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం. అనేక జీవరాశులకు ఇది నిలయం. కొల్లేరు అభయారణ్య పరిరక్షణకు అటవీశాఖ కట్టుబడి ఉంది. పక్షి ప్రేమికులకు స్వర్గధామంగా నిలుస్తున్న ఆటపాక పక్షుల కేంద్రంలో అన్ని వసతులు కల్పించాం. కొల్లేరు ప్రజల కోసం సర్కారు కాల్వపై వారధి నిర్మాణానికి శాఖపరమైన అనుమతులు ఇచ్చారు. త్వరలో వారధి ప్రారంభం కానుంది. కొల్లేరుల పక్షుల వేటను నిరోధించాం. రానున్న రోజుల్లో కొల్లేరు గొప్ప పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. – **జి.శ్రీనివాసరావు, అటవీశాఖ రేంజర్, కైకలూరు**

స్కేటింగ్ క్రీడాకారులను అభినందించిన డిప్యూటీ సీఎం



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపముఖ్యమంత్రి

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతిభావంతులైన క్రీడాకారులతో తాడేపల్లిగూడెంకు జాతీయస్థాయి గుర్తింపు ఖాయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని స్కేటింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం క్రీడాకారులను మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం స్కేటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బిళ్ళ ఆశాదేవి, వైస్ ప్రెసిడెంట్ పులపర్తి ముత్యాలరావు, కార్యదర్శి పెద్దిరెడ్డి నరేష్, జాయింట్ సెక్రటరీ మానేపల్లి సతీష్, సత్త రామకృష్ణారెడ్డి, పచ్చిగోళ్ళ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య డాట్ కాం వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

తణుకు: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి రిషి రూపొందించిన సాహిత్య డాట్ కాం వెబ్‌సైట్‌ను మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం ఆవిష్కరించారు. విజయవాడ పున్నమి ఘాట్ ఆడిటోరియంలో నిర్వహించిన బోయి భీమన్న జయంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రోజా వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాచీన కవుల నుంచి నేటి ఆధునిక కవుల వరకు రచించిన రచనలు, కవితలు, నవలలు, ఆధ్యాత్మిక, సామాజిక గ్రంథాలు ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E- PROCUREMENT TENDER NOTICE
Roc No.2422/E1/2023-24 Dated: 18-09-2023

S.No	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs.)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Civil,Water supply & Electrical Works - 14Nos	General Founds	71.42	20.09.2023	26.09.2023

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender. apeprocurement.gov.in
Commissioner
Tadepalligudem Municipality

గురువులే ప్రత్యక్ష దైవాలు

అపుస్మా ఉపాధ్యాయ దినోత్సవాల్లో మంత్రి కారుమూరి



తణుకులో ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో అపుస్మా నాయకులు

తణుకు అర్బన్: సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తున్న గురువులు ప్రత్యక్ష దైవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఆధ్వర్యంలో తణుకు క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును బంగారుబాటగా మలుస్తున్న ఉపాధ్యాయులందరూ అభినందనీయులన్నారు. విద్యావిధానం అభివృద్ధి పథంలో నడిస్తే రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని ప్రాధాన్యత విద్యాశాఖకు ఇచ్చారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రూ.65 వేల కోట్లు విద్యాశాఖకు వెచ్చించి అమ్మ ఒడి ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో చదివే మధ్య తరగతి వర్గాలకు కూడా అండగా నిలబడ్డారని చెప్పారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యావిధానంలో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో గతంలో 15వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని నేడు 3వ స్థానానికి తీసుకువచ్చారని అన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, ప్రభుత్వం ద్వారా హెల్త్ కార్డులు అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి కారుమూరి ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులను అపుస్మా ఆధ్వర్యంలో మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించగా, మంత్రి కారుమూరిని అపుస్మా నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వంక రాజకుమారి, కళాశాలల అసోసియేషన్ నాయకులు ప్రగతి రాజా, అపుస్మా స్టేట్ హానరరీ ప్రెసిడెంట్ బి.గోపాలకృష్ణ, అడిషినల్ జనరల్ సెక్రటరీ ఎంబీఎస్ శర్మ, రీజియన్ ప్రెసిడెంట్ జంగా బాలాజీ, స్టేట్ ఈసీ మెంబరు బి.విద్యాకాంత్, అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు, తణుకు జోన్ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు తదితరులు పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం అర్బన్: మండలంలోని మెట్ట ఉప్పరగూడెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పవన్ కల్యాణ్‌ను కూడా విచారించాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు



తణుకులో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తణుకు టౌన్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జరిగిన అవినీతిలో పవన్‌కు భాగముందని.. అప్పటి ప్రభుత్వం చేసిన అవినీతిలో పవన్ కల్యాణ్‌ను కూడా అరెస్ట్ చేసి విచారించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింట్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు మాట్లాడుతూ.. 2014లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల పొత్తులో భాగంగానే టీడీపీ ప్రభుత్వం ఏర్పడిందని, అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడితో పాటు అతనితో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్‌కు కూడా దోపిడీలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. పొత్తుతోనే 2024 ఎన్నికలకు వెళ్తున్నట్లు ప్రకటించడంతో జనసేన నాయకులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. పవన్ కల్యాణ్ అభిమానులు అతనిని ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటే పవన్ మాత్రం చంద్రబాబునే ముఖ్యమంత్రిని చేయాలని ఆరాటపడుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ నిర్ణయంతో జనసేన నాయకులతో పాటు టీడీపీ నాయకులు కూడా వచ్చే ఎన్నికల్లో తమకు సీట్లు ఇస్తారో లేదోనని ఆందోళనలో ఉన్నారని చెప్పారు.

భీమవరంలో యువకుడి హత్య

మృతుడు రౌడీషీటర్



హత్యకు గురైన విజయ్‌బాబు (ఫైల్)



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి, భీమవరం: భీమవరంలో పట్టపగలు యువకుడి హత్య సంచలనం రేపింది. రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇచ్చి గంట గడవక ముందే ఈ హత్య జరిగింది. భీమవరం రెండో పట్టణం బలుసుమూడి గాంబీర్‌దొడ్డికి చెందిన బెవర విజయ్‌బాబు (23)ను గుర్తు తెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హత్య చేశారు. గతేడాది డిసెంబర్ 24న జరిగిన రౌతుల ఏసు హత్య కేసులో విజయ్‌బాబు నిందితుడు. రౌడీషీటర్లకు భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తున్న విజయ్‌బాబు, గోవిందరావును గొల్లవానితిప్ప రోడ్డులోని దుర్గాలక్ష్మి ఆలయ సమీపంలో కారుతో ఢీకొట్టగా బైక్ నడుపుతున్న విజయ్‌బాబు కిందపడిపోయాడు. సోదరుడు గోవిందరావు పక్కనే ఉన్న పంటకాలువలోకి దూకి అవతలి గట్టుకు చేరుకుని నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు.

హంతకుల్లో ఒకరి అరెస్టు

ఢీకొట్టిన అనంతరం కారు విజయ్‌బాబును కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. దుండగులు అతనిపై కత్తులతో దాడి చేసి తల, మెడపై విచక్షణారహితంగా నరకడంతో విజయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కారులో నలుగురు, రెండు మోటార్‌సైకిళ్లపై వాహనాల్లో నిందితులు వెంబడించినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం కారు పట్టణం వైపు వెళ్లినట్లు పోలీసులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. హత్య ఘటన తెలిసిన వెంటనే ఎస్సై అప్పారావు, ఏఎస్సై బాజీ ఒక యువకుడ్ని వెంటాడి పట్టుకోగా ఆ యువకుడి చేతిలో హత్య సమయంలో ఉపయోగించిన కత్తి ఉన్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన యువకుడు భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ రవిప్రకాష్ పరిశీలించాడు. మృతుడిపై రౌడీషీట్ ఉందని, హత్యకు కారణాలు సేకరిస్తున్నామన్నారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామన్నారు. రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా భీమవరం టౌన్‌హాల్ వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందచేస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: భీమవరం ఎల్‌హెచ్ టౌన్‌హాల్‌లో 83వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటైన ఎల్‌హెచ్ టౌన్ హాల్ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యవర్గం మంచి స్ఫూర్తితో సంఘటితంగా మంచి కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగిన 12 ఈవెంట్స్‌లో గెలుపొందిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. 83వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన టోర్నమెంట్లలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, టౌన్ హాల్ ప్రెసిడెంట్ బండి శక్తీశ్వర సాంబమూర్తి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తోట జగదీశ్, టౌన్ హాల్ మాజీ అధ్యక్షుడు మెంటే పార్థసారథి, ప్రధాన కార్యదర్శి కామన నాగేశ్వరరావు, కార్యదర్శి గ్రంధి సురేష్, పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపిక



ఎం.కిశోర్‌బాబు



ఎండీ కాలిష్



యు.అఖిల్‌వర్మ

అత్తిలి: డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సనాతన సంస్థాన్ సంయుక్తంగా నిర్వహించే 3వ జాతీయ స్థాయి దివ్యాంగుల టీ–20 క్రికెట్ పోటీలకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకు రాజస్థాన్‌లో ఈ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఎం.కిశోర్‌బాబు, ఎండీ కాలిష్, యు.అఖిల్‌వర్మలు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు రాణించాలని ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ, జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం కార్యదర్శి దాసం వెంకట దుర్గారావు కోరారు.

ఉమాసోమేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలోని పంచారామక్షేత్రంలో కొలువైన ఉమాసోమేశ్వర స్వామి లింగాన్ని ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా స్వామిక ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు ఉమాసోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

జీఈఆర్ సర్వేపై అధికారుల సంతృప్తి


తాడేపల్లిగూడెంలో సర్వేపై పరిశీలన చేస్తున్న కమిషనర్ శామ్యూల్, ఎంఈఓ జ్యోతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చేపట్టిన ఎడ్యుకేషన్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వే పారదర్శకంగా జరిగిందని మునిసిపల్ కమిషనర్ శామ్యూల్, తాడేపల్లిగూడెం ఎంఈఓ పీఎంకే జ్యోతి తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించిన జీఈఆర్ సర్వేపై ఆదివారం సాయంత్రం పలు వార్డులలో వెరిఫికేషన్ టీం ఆధ్వర్యాన పరిశీలించారు. పట్టణంలో కమిషనర్, ఎంఈఓ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్‌పీలు, అలాగే మండలంలో ఎంపీడీఓ విశ్వనాథం, ఏపీఓఆర్‌డీ వెంకటేష్ ఆధ్వర్యాన పరిశీలన జరిగింది. ఐదేళ్ల నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలు బడిలోనే ఉండాలని ఉద్దేశ్యంతో చేసిన జీఈఆర్ సర్వే పారదర్శకంగా ఉందని అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

83 మందికి కంటి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యాన ఆదివారం కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్‌లో అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో కంటి వైద్యశిబిరం జరిగింది. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు 83 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్‌లకు 18 మందిని నిడదవోలుకు పంపారు. 20 మందికి ఉచితంగా కళ్ళజోడ్లు పంపిణీకి నిర్ణయించారు. బాపయ్య శర్మ శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సభ్యులు పర్యవేక్షించారు.

ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు

తణుకు టౌన్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు పురస్కరించుకుని తణుకులో బీజేపీ పట్టణాధ్యక్షుడు పెదమల్లు అవినాష్ కాంత్ ఆధ్వర్యాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ తాడేపల్లిగూడెం నాయకుల ఆధ్వర్యాన పెద తాడేపల్లి గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మోడీ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీసరస్వతి, సూపర్‌వైజర్ కె.విశాలాక్షి కోరారు. ఆదివారం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలింతలు, కిశోర బాలికలకు న్యూట్రిషియన్‌పై ఎగ్జిబిషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన కళా కేంద్రంలో ఆదివారం రాత్రి నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం అలరించింది. ట్రాక్ సింగింగ్‌తో పాటు నాట్యాచార్య ఇమంది వెంకట పైడారావు, నాట్యాచారిణి అర్చన (కాకినాడ) నృత్య ప్రదర్శన, అనంతరం వనచర్ల నాగేంద్ర ప్రసాద్, విజయలక్ష్మిలకు గౌరవ పురస్కారం, నాట్యాచార్య పైడారావుకు కళారత్న పురస్కారం, సాంబ్రాణి సూర్యనారాయణకు హార్థిక సత్కారం చేశారు. కళాకారులు, సంగీత ప్రియులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

పాత ఇళ్ల నిర్మాణాలకు నిధులు

- ఎస్టీ కాలనీవాసులకు ఉప ముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణ హామీ
- మెట్ట ఉప్పరగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: మండలంలోని మెట్ట ఉప్పరగూడెం ఎస్టీ కాలనీలో పాత ఇళ్ల నిర్మాణాలకు నిధులు అందజేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామంలో 333 ఇళ్ళ పట్టాలు, 303 మందికి గృహాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. ఎస్టీ కాలనీలో గతంలో ప్రభుత్వ నిధులతో నిర్మించుకున్న పాత గృహాల స్థానంలో నూతనంగా నిర్మించుకునేందుకు నిధులు అందజేస్తామని తెలిపారు. రూ.1.80 లక్షలు, భవన నిర్మాణ సామాగ్రిని మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు నిర్మించేందుకు రూ.10 లక్షలు, ఇటుకులగుంట, అమృతపురం గ్రామాలకు రూ.10 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ఈ నిధులను రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి వినియోగించుకోవాలని సూచించారు. రూ.25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాలును పూర్తి సౌకర్యాలతో నిర్మించేందుకు ప్రణాళిలు సిద్ధం చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో రహదారులు నిర్మించేందుకు మరో రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి సుమారుగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు వరకు ప్రభుత్వం అందించే సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. తొలుత ఆయన గ్రామంలో ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు.

తణుకులో చవితి సందడి

తణుకు అర్బన్: వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా పట్టణంలోని గణేష్ ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాల వెలుగులతో కాంతులీనుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డులోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద దేవతామూర్తుల చిత్రాలతో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాల కటౌట్ ఆకట్టుకుంటుంది. తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో ప్రతి ఏటా నిర్వహించే వేడుకల్లో భారీ విగ్రహాన్ని హైదరాబాద్ నుంచి తెప్పించి పూజాధికాలకు సిద్ధం చేశారు. బ్యాంక్ కాలనీ, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, పాతవూరు తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో గణేశుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. పూజా సామగ్రి కొనుగోలుదారులతో రాష్ట్రపతి రోడ్డు కిక్కిరిసింది.

మట్టి వినాయకుడినే పూజిద్దాం


తాడేపల్లిగూడెంలో మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడినే పూజిద్దామని లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నా రు. స్థానిక రామారావు పేటలోని డైమండ్స్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన పేరిచర్ల ఫౌండేషన్ సౌజన్యంతో మట్టి వినాయక ప్రతిమలు, మొక్కలను పంపిణీ చేశా రు. మునగాల జితేంద్ర, కె.వెంకటేశ్వరరావు, వై.సత్యదేవ్, సత్యనారాయణరాజు, సూరిబాబు, వశిష్ట క్లబ్ వావిలాల సరళాదేవి, మాధురి, సాయి శృతి, సంపత్, నందిని, ప్రజ్ఞ పాల్గొన్నారు. జ్యోతి ఎడ్యుకే షనల్ సొసైటీ ఆధ్వర్యాన అధినేత దత్తు వెంకటేశ్వరరావు విద్యార్థులు మట్టి గణే ష్ ప్రతిమల ను పంపిణీ చేశారు.

అత్తిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూ రి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు వైఎస్సా ర్ సీపీ మండలాధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మ హ్మద్ అబీబుద్దీన్ పాల్గొన్నారు.


అత్తిలిలో మట్టి విగ్రహాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పైబోయిన సత్యనారాయణ

కారుమూరి సేవా సమితి ఆధ్వర్యాన..

తణుకు అర్బన్: కారుమూరి సేవా సమితి ఆధ్వర్యాన తణుకు మునిసిపాలిటీ, నరేంద్ర సెంటర్, శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ ఆవరణల్లో 6 వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అంతా మట్టి విగ్రహాలనే పూజించాలని ఆకాంక్షించారు. పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందర రామరాజు, నాయకులు పాల్గొన్నారు. పతంజలి యోగా కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యాన స్థానిక సూర్యాలయం వీధిలో యోగా గురువు కర్రి శ్రీనివాసురెడ్డి 400 మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు అందజేశారు. రెడ్డిజన సంఘం అధ్యక్షుడు తమనంపూడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈనెల 25, 26, 27 తేదీల్లో బాపట్లలో జరగనున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు కోరారు. కపర్థి భవనంలో ఆదివారం సంఘ ఉపాధ్యక్షుడు ఉల్లింకల జయకృష్ణ ఆధ్వర్యాన గోడ పత్రికను ఆవిష్కరించారు. బండారు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం


తణుకులో విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కారుమూరి, సంఘ నాయకులు

తణుకు అర్బన్: స్వర్ణకారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వేల్పూరు రోడ్డులో ఆదివారం తణుకు స్వర్ణకార సంఘం ఆధ్వర్యాన జరిగిన స్వర్ణకారుల ఆరాధ్య దైవం శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం శుభపరిణామమన్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్వబ్రాహ్మణ వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తొలుత స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పొడుగు రామాచారి (రాము) అధ్యక్షతన జెండాను ఆవిష్కరించి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందర రామరాజు, పార్టీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, స్వర్ణకార సంఘం కార్యదర్శి గొల్తి హరికృష్ణ ప్రసాద్, కోశాధికారి కొమ్మోజు రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ ధవలేశ్వరపు సుబ్బారావు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున విశ్వబ్రాహ్మణ విజ్ఞాన మండపంలో శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని 33వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. బలుసులమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు హాజరై పూజలు నిర్వహించారు. పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పెదప్రోలు వెంకటాచార్యులు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా వృద్ధులకు పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించే కార్యక్రమంలో భాగంగా ఇంటి నుంచి నడవలేని 13 మంది వృద్ధులకు ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. తణుకుకు చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ సంచార వైద్యశాల ద్వారా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వైద్య సేవలందించినట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యురాలు ఆలపాటి మాధవి ఆర్థికసాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహించే ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షా శిబిరంలో 43 మందికి పరీక్షలు చేసినట్లు చెప్పారు. తణుకు బ్యాంక్ కాలనీలో గల అసోసియేషన్ భవన్‌లో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయిస్వేత డయాగ్నస్టిక్ సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

ఘనంగా వావిలాల గోపాల కృష్ణయ్య జయంతి

తణుకు టౌన్: సోషలిస్టు నాయకుడు, ఆంధ్రా గాంధీగా ప్రసిద్ధుడైన వావిలాల గోపాల కృష్ణయ్య జయంతిని తణుకు సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యాన స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గోపాల కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ 'నా మార్గం గాంధీ మార్గం, నా ఆశయం సామ్యవాదం' అని చెప్పిన నాయకుడు వావిలాల గోపాల కృష్ణ అని చెప్పారు. విద్యార్థులకు వావిలాల జీవిత చరిత్రపై వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మారుతీ కళాశాల తెలుగు, సంస్కృత అధ్యాపకుడు టి.పవన్ కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె.సుగుణ కుమారి, గుత్తికొండ కృష్ణారావు, ఎం.మోహన్‌రావు, ఎండీ సిరాజుద్దీన్, జి.శ్రీనివాసరావు, బి.కుమారి, జి.బిందు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు చేరిన గణనాథులు


అత్తిలిలో పూల దుకాణాల వద్ద రద్దీ

అత్తిలి: వినాయక చవితి ఉత్సవాలకు గణపతులు మండపాలకు చేరుకుంటున్నారు. విగ్రహాలను ఊరేగింపుగా తరలిస్తున్నారు. అత్తిలిలో దుకాణాల నుంచి వివిధ రూపాలలో 2 నుంచి 12 అడుగుల ఎత్తు వరకు ఉన్న గణపతి ప్రతిమల ను వాహనాల్లో మండపాలకు తీసుకెళ్తున్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో గణపతి ప్రతిమలను ఊరేగింపుగా మండపాలకు చేర్చారు.

పండ్లు, పూల దుకాణాల వద్ద సందడి

గణపతి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా అత్తిలి ప్రధాన రహదారి పక్కన పూజా సామాగ్రి దుకాణాలు వెలసాయి. పండ్లు, పూలు, మట్టి గణపతి ప్రతిమలు, పత్రులను విక్రయించే దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. పూలు, పండ్ల ధరలు అధికంగా ఉన్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన మోటుపల్లి కోట నాగసత్యనారాయణ కుటుంబ సభ్యులు 10 గ్రాముల బంగారం సమర్పించారు. దాతకు ఆలయ ఈఓ యర్రంశెట్టి భద్రాజి, ధర్మకర్తలు ముత్యాల వెంకటరామరావు, సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అమ్మవారి శేషవస్త్రం అందజేశారు.